డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

**విలేకరులు కావలెను..**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ *జనం వాయిస్* తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..

సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి Peddapalli | శుక్రవారం Friday | 13 -02 -2026 13 -02-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 26 Issue: 26 | పేజీలు : 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|




## రూ.646.46 కోట్ల ఆర్థిక సంఘం

# నిధులు విడుదల

- గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ.259.36 కోట్లు.
- తాజా విడతతో మొత్తం రూ.387 కోట్లు విడుదల.
- పెండింగ్ నిధులు త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి.
- తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి.
- గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం


2



## రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

- గాంధీ సరోవర్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి ఆహ్వానం.
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వివరాలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.
- ఈసామూసీ సంగమంలో ప్రపంచ స్థాయి కేంద్రం నిర్మాణం.
- శాంతి, ఐక్యతకు ప్రతీకగా గాంధీ సరోవర్.

2




## ఓటు వేయలేదని డబ్బులు, కుక్కర్లు తిరిగి అడిగిన అభ్యర్థి

అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఘటన. "ఇవ్వమని ఎవరడిగారు?" అంటూ నిలదీత.

2



## సింగరేణి చైర్మన్‌గా డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ బాధ్యతల స్వీకారం



- 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.
- పలు కీలక శాఖల్లో విస్తృత అనుభవం.



## ఆత్మగౌరవ సభలో నివాళులు

- ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి.
- అమరవీరులకు రెండు నిమిషాల మౌనం.
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమం.
- పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని తరతరాలకు అందించే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నాసిరకం భోజనంపై విద్యార్థుల ఆందోళన

జూకల్ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నిరసన.

2



# నేడే 'పుర' తీర్పు

- అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్!
- పట్టణ ఓటరు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ!
- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం.
- మధ్యాహ్నం లోపు పూర్తి స్థాయి ఫలితాలు వెలువడే అవకాశం.
- కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీగా పోలీసులు.
- శాంతిభద్రతల దృష్ట్యా 144 సెక్షన్ అమలు.



2

## నాకు సంబంధం లేదు

మహదేవప్ప మృతిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందన

కాల్‌డేటా పరిశీలించుకోవచ్చని వ్యాఖ్య. బెదిరింపుల ఆరోపణలపై కలకలం.



2

## జగ్గారెడ్డిపై కేసు నమోదు

- పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత.
- సీఐపై ఆరోపణలు.
- న్యాయస్థానంలో తేలుతుందని జగ్గారెడ్డి వ్యాఖ్య.





# తెలంగాణ గ్రామ పంచాయితీలకు గుడ్ న్యూస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యాయి. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల కాగా, తాజాగా మరో విడతగా రూ.387 కోట్లు విడుదలయ్యాయి. దీంతో రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.646.46 కోట్ల నిధులు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. ఈ నిధులతో గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభించనుంది. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి అవసరాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకా కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.2,400 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలవారీగా నిధులు విడుదలవుతున్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.

# రాజ్‌నాథ్ సింగ్‌కు ఆహ్వానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా ఈసామూసీ నదుల సంగమ స్థలిలో నిర్మించనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా సౌత్ బ్లాక్‌లోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో, పర్యావరణ హితంగా మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 1948లో జాతిపిత మహాత్మా గాంధీ చితాభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ సమీపంలో గాంధీ సరోవర్ నిర్మించనున్నట్లు తెలియజేశారు. గాంధీజీ ఆశయాలైన శాంతి, ఐక్యత, సుస్థిర అభివృద్ధి, నిరాడంబర జీవనశైలిని ప్రతిబింబించేలా ఈ ప్రాజెక్టును రూపుదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా గాంధీ సరోవర్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి నెలాఖరులో నిర్వహించనున్న శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని రక్షణ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఈ భేటీలో ఎంపీలు ఎం అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు వేయలేదని డబ్బులు, కుక్కర్లు తిరిగి అడిగిన అభ్యర్థి

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఓ కాంగ్రెస్ అభ్యర్థి ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. తనకు ఓటు వేయలేదని ఆరోపిస్తూ ముందుగా పంచిన డబ్బులు, కుక్కర్లు తిరిగి ఇవ్వాలని ప్రజలను కోరినట్లు సమాచారం. స్థానికుల వాదన ప్రకారం, ఓటు వేయలేదని కారణం చూపుతూ అభ్యర్థి అవమానకరంగా మాట్లాడినట్లు ఆరోపించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డబ్బులు, కుక్కర్లు ఇవ్వమని ఎవరడిగారని, ఎందుకు ప్రజలను అవమానిస్తున్నారని స్థానికులు నిలదీశారు. ఈ ఘటనపై వార్డు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురి చేసి, అనంతరం అవమానకరంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన హక్కు అని స్పష్టం చేశారు. ఈ సంఘటనపై స్థానిక అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేడే 'పుర' తీర్పు

**హైదరాబాద్,ఫిబ్రవరి 12, జనం వాయిస్:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల గడియ రానే వచ్చింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో నేడు తేలనుంది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నం లోపు పూర్తి స్థాయి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

**- హోరాహోరీ పోరు..**

- ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం.. మెజారిటీ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవకాశం ఉండగా, రామగుండం, నల్గొండ వంటి చోట్ల గట్టి పోటీ కనిపిస్తోంది. మరోవైపు నిజామాబాద్, కరీంనగర్ వంటి నగరాల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉంది.

**- కీలక అంశాలు:**

ఓటింగ్ శాతం: రాష్ట్రవ్యాప్తంగా సుమారు 73.01% పోలింగ్ నమోదు కావడం విశేషం. ముఖ్యంగా మహిళా ఓటర్లు భారీగా తరలిరావడం ఏ పార్టీకి కలిసి వస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

- బ్యాలెట్ విధానం: ఈ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరగడంతో ఫలితాల వెల్లడికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

**- ప్రభావం చూపే పట్టణాలు:** కొత్తగూడెం, మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో గెలుపు గుర్రాలు ఎవరనే దానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

**- ఎగ్జిట్ పోల్స్ ఏం చెబుతున్నాయి?**

ప్రముఖ సర్వే సంస్థల అంచనాల ప్రకారం.. కాంగ్రెస్ 65 నుండి 75 మున్సిపాలిటీలను గెలుచుకునే అవకాశం ఉందని, బీఆర్ఎస్ 30 స్థానాల వరకు పరిమితం కావచ్చని తెలుస్తోంది. ఎంఐఎం తన పాతబస్తీ కోటను భద్రపరుచుకునే దిశగా సాగుతోంది.

**-భద్రత కట్టుదిట్టం..**

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. గెలిచిన అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలపై ఆంక్షలు విధించారు. శాంతిభద్రతల దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉంది.

# సింగరేణి చైర్మన్‌గా డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ బాధ్యతల స్వీకారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా సేవలందించారు. రవాణా, భూమి రికార్డులు, సామాజిక సంక్షేమ రంగాల్లో విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు మరియు ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ వంటి కీలక బాధ్యతలు నిర్వహించారు. సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఆయన బాధ్యతల స్వీకారం సందర్భంగా తెలిపారు.

# నాకు సంబంధం లేదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

మక్తల్ మున్సిపల్ బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప మృతిపై రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. మహదేవప్ప మృతితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ మహదేవప్పకు ఫోన్ చేయలేదని, కావాలంటే తన కాల్‌డేటాను పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. పోస్ట్‌మార్టం నివేదికలో పూర్తి వివరాలు బయటపడతాయని మంత్రి తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో పోలింగ్‌కు కొద్ది గంటల ముందు బీజేపీ వార్డు అభ్యర్థి మహదేవప్ప (45) బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో ఉద్రిక్తత నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు మాత్రం మంత్రి వాకిటి శ్రీహరి బెదిరింపుల కారణంగానే మహదేవప్ప ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. 'ప్రచారం నుంచి తప్పుకో, లేకపోతే అంతుచూస్తా' అని బెదిరించారని బంధువులు పేర్కొన్నారు. కొద్ది రోజులుగా కాంగ్రెస్ నాయకులు కూడా ప్రచారం నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. తాను గెలిచినా బతకనివ్వరని చెప్పిన కొన్ని గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకుందని మృతుడి భార్య సత్యమ్మ కన్నీటితో వివరించిన విషయం చర్చనీయాంశమైంది. ఘటనపై పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# జగ్గారెడ్డిపై కేసు నమోదు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

పురపాలక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు



సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం జరిగిన పోలింగ్ సమయంలో సంగారెడ్డిలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థిని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గల్లా పట్టి ఈడ్చుకెళ్లారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. సమాచారం అందుకున్న జగ్గారెడ్డి తన అనుచరులతో పోలింగ్ బూత్‌కు చేరుకుని పోలీసుల చర్యలను ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలింగ్‌ను ఆపేస్తామని హెచ్చరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు జగ్గారెడ్డితో పాటు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. తనపై కేసు నమోదు చేయడంపై జగ్గారెడ్డి స్పందిస్తూ, దొంగ ఓట్లను అడ్డుకున్న తమ నేతపై సీఐ దాడి చేశారని ఆరోపించారు. తమ అభ్యర్థిని కొట్టినందుకే సీఐని తిట్టాల్సి వచ్చిందని తెలిపారు. సీఐ శివకుమార్ బీఆర్ఎస్ అభ్యర్థికి సహకరించారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినా చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనలో తప్పు ఎవరిదో న్యాయస్థానంలో తేలుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులపై కూడా జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ నేతలు పోలీసులపై ప్రవర్తించిన తీరు గురించి ముందుగా మాట్లాడాలని సూచించారు. నిన్నటి ఘటనను తాను అక్కడితో వదిలేశానని, అయితే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఘటనతో సంగారెడ్డిలో రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది.


# నాసిరకం భోజనంపై విద్యార్థుల ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 (జనం వాయిస్):**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నాసిరకం భోజనం అందిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. భోజనం నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. విద్యార్థులు తమకు ఇచ్చిన అన్నం గిన్నెలను రోడ్డుపై పారేసి, గిరిజన ఆశ్రమ పాఠశాల సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసుల చర్చల అనంతరం విద్యార్థులు ధర్నాను విరమించినట్లు సమాచారం. భోజన నాణ్యతపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# రాహుల్ గాంధీ అనర్హతపై నోటీసు


- నిశికాంత్ దూబే డిమాండ్.
- లోక్‌సభ సభ్యత్వం రద్దు ప్రక్రియ ప్రారంభించాలంటూ విజ్ఞప్తి.
- నిధుల మూలాలు, ప్రచురితం కాని పుస్తకంపై ప్రశ్నలు.
- సోరోస్ ఫౌండేషన్ ఆరోపణలతో రాజకీయ ఉద్రిక్తత.



**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 :**

కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీని అనర్హుడిగా ప్రకటించాలని భారతీయ జనతా పార్టీ ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ లోక్‌సభలో నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. నిశికాంత్ దూబే మాట్లాడుతూ, రాహుల్ గాంధీకి నిధులు ఎవరు అందిస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని ఎం. ఎం. నరవణె పుస్తకం ఎలా చేరింది? అనే అంశాలు వెలుగులోకి రావాలని అన్నారు. భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలపై కూడా నోటీసులో ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడం రాహుల్ గాంధీకి ఇది మొదటిసారి కాదని ఆయన విమర్శించారు. రక్షణ, ఆర్థిక, వాణిజ్యం, విదేశాంగ వ్యవహారాలు వంటి అంశాలపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సోరోస్ ఫౌండేషన్ అండతో దేశాన్ని అంతర్గతంగా దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని నిశికాంత్ దూబే ఆరోపించారు. కాగా, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె రాసిన ప్రచురించని పుస్తకంపై ఇటీవల పార్లమెంటులో తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ప్రముఖ వార్తా వాచకురాలు సరళా మహేశ్వరి కన్నుమూత



- దూరదర్శన్‌లో హిందీ వార్తలకు ప్రత్యేక గుర్తింపు.
- స్పష్టమైన ఉచ్చారణ, హుందాతనంతో ఆకట్టుకున్న స్వరం.
- ఆసియా క్రీడలు, రాజీవ్ గాంధీ హత్య వంటి కీలక ఘటనల కవరేజ్.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**

దూరదర్శన్‌లో హిందీ వార్తలు చదివిన ప్రముఖ యాంకర్ సరళా మహేశ్వరి కన్నుమూశారు. ఆమె వయసు 71 సంవత్సరాలు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ సంస్థ నివాళి అర్పించింది. భారతీయ వార్తా ప్రపంచంలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొంది. సరళమైన కంఠం, స్పష్టమైన ఉచ్చారణ, హుందాతనంతో హిందీ వార్తలను చదివి ప్రేక్షకులను ఆకట్టుకున్నారని గుర్తుచేసింది. సరళా మహేశ్వరి 1976లో దూరదర్శన్‌లో వార్తా ప్రకటనకర్తగా చేరారు. 1982లో పూర్తి స్థాయి వార్తా వాచకురాలిగా బాధ్యతలు స్వీకరించారు. అదే ఏడాది ఆసియా క్రీడలు, 1991లో రాజీవ్ గాంధీ హత్య వంటి కీలక ఘటనలను కవర్ చేశారు. పంజాబ్‌లో ఉగ్రవాద హింస చెలరేగిన సమయంలో కూడా ఆమె వార్తలు చదివి గుర్తింపు పొందారు. హిందీ భాషపై పట్టు, తేలికైన చీర కట్టు, స్థిరమైన శైలి ఆమె ప్రత్యేకతగా నిలిచాయి. ఆ కాలంలో ప్రత్యక్ష ప్రసారాల్లో వార్తలు చదివిన యాంకర్‌గా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 1984 తరువాత బ్రిటన్‌లోని బీబీసీలో కూడా వార్తా వాచకురాలిగా పనిచేశారు. 1988లో తిరిగి దూరదర్శన్‌లో చేరి సేవలందించారు. 2005లో దూరదర్శన్‌కు రాజీనామా చేసిన సరళా మహేశ్వరి, వార్తా రంగంలో తన ముద్రను చిరస్థాయిగా నిలిపారు. ఆమె మరణంతో భారతీయ ప్రసార రంగం ఒక ప్రతిభావంతురాలిని కోల్పోయింది.

# ఉపరాష్ట్రపతిని కలిసిన కేరళ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల బృందం

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**



కేరళ రాష్ట్రంలోని స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధుల బృందం భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభాధ్యక్షుడు సి. పి. రాధాకృష్ణన్‌ను ఈరోజు పార్లమెంట్ భవనంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా స్థానిక పరిపాలన వ్యవస్థ, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ప్రతినిధులు తమ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన విషయాలను ఉపరాష్ట్రపతికి వివరించినట్లు తెలిసింది. ఉపరాష్ట్రపతి ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ, ప్రజల సమస్యలను సమర్థంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ భేటీ సౌహార్ద వాతావరణంలో సాగినట్లు సమాచారం.

# జాహ్నవి కందుల కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

- అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి.
- 29 మిలియన్ డాలర్ల ఒప్పందానికి సియాటెల్ అంగీకారం.
- పోలీసు అధికారి నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు.

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**




అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యంతో మృతి చెందిన కర్నూలుకు చెందిన జాహ్నవి కందుల (23) కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల పరిహారం ఇవ్వడానికి సియాటెల్ నగరం ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారత కరెన్సీలో సుమారు రూ. 262 కోట్లకు సమానం. 2023 జనవరి 23న సియాటెల్‌లో రోడ్డు దాటుతున్న సమయంలో పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టడంతో జాహ్నవి మరణించారు. సియాటెల్ నగర న్యాయవాది ఎరికా ఇవాన్స్ ఈ పరిహారంపై ప్రకటన విడుదల చేశారు. జాహ్నవి మృతి చాలా బాధాకరమని, ఈ పరిహారం ఆమె కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందంపై జాహ్నవి కుటుంబం నుంచి ఇంకా స్పందన రావాల్సి ఉంది. ఇరుపక్షాలు గత వారం కోర్టులో పరిహార ఒప్పందానికి సంబంధించిన దరఖాస్తు దాఖలు చేసినట్లు సమాచారం. జాహ్నవి సౌత్ లేక్ యూనియన్ ప్రాంతంలోని నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ కోసం 2021లో అమెరికా వెళ్లారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనాల వేగ పరిమితి 40 కిలోమీటర్లుగా ఉండగా, సంబంధిత పోలీసు అధికారి 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపినట్లు వెల్లడైంది. ఢీకొట్టిన దెబ్బకు జాహ్నవి సుమారు 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు నివేదికలు సూచించాయి. ప్రమాదం అనంతరం పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు అమెరికాలోనూ వ్యతిరేకత వ్యక్తమైంది. అనంతరం సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు.

# సాయుధ శక్తి ప్రత్యక్ష అనుభవం

- త్రివిధ దళాల అధికారుల సమన్వయ సందర్శన
- యుద్ధ కసరత్తులు, ట్యాంకుల వ్యూహాత్మక వినియోగం పరిశీలన
- సంయుక్త కార్యాచరణ అవగాహన మరింత బలోపేతం

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**

భూ సైన్యానికి చెందిన "బ్లాక్ ఛార్జర్ బ్రిగేడ్"లో వాయుసేన, నౌకాదళ అధికారులకు యుద్ధ సన్నద్ధతపై ప్రత్యక్ష అనుభవం కల్పించారు. సాయుధ దళాల సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మానేవర్ వార్‌ఫేర్ విధానాలు, గన్నరీ కసరత్తులు, యథార్థ పరిస్థితుల్లో ట్యాంకుల వ్యూహాత్మక వినియోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. భూభాగ యుద్ధ వ్యూహాలు, వేగవంతమైన కదలికలు, దాడి–రక్షణ పద్ధతులపై సమగ్ర అవగాహన పొందారు. త్రివిధ దళాల మధ్య పరస్పర సమన్వయం పెంపొందించేందుకు ఈ పరస్పర చర్యలు ఉపయోగపడుతున్నాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. ఒకే యుద్ధం, ఒకే సైన్యం, సమగ్ర సమన్వయ దాడి శృంఖల అనే లక్ష్యంతో సంయుక్త కార్యాచరణపై దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా త్రివిధ దళాల మధ్య ఆపరేషనల్ అవగాహన మరింత బలోపేతం కావడంతో పాటు, సమగ్ర రక్షణ వ్యూహాల అమలులో కొత్త దిశకు నాంది పలికినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.



# రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం



**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**

ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధవిమానాల సంఖ్యను పెంచుకోవాలని భారత్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ దేశం నుంచి అదనంగా యుద్ధవిమానాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ. 3.25 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకునేందుకు అనుమతి లభించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. కొనుగోలు చేయనున్న 114 యుద్ధవిమానాల్లో 88 ఒకే సీటు వేరియంట్లు, 26 రెండు సీట్ల వేరియంట్లు ఉంటాయి. ఇప్పటికే భారత వాయుసేన వద్ద 36 రఫేల్ యుద్ధవిమానాలు సేవలో ఉన్నాయి. దేశీయ తయారీకి ప్రాధాన్యం ఇస్తూ ఈ ఒప్పందాన్ని అమలు చేయనున్నారు. రఫేల్ తయారీ సంస్థ డసో ఏవియేషన్ భారతదేశంలోని ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని తయారీ, అసెంబ్లీ కార్యకలాపాలు చేపట్టే అవకాశముందని సమాచారం. దీంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# రూ. 3.60 లక్షల కోట్ల రక్షణ ప్రతిపాదనలకు ఆమోదం

- రఫేల్ యుద్ధ విమానాలు, సముద్ర నిఘా విమానాలకు గ్రీన్ సిగ్నల్
- భూ, వాయు, నౌకాదళాల సామర్థ్య విస్తరణ
- దేశ భద్రత బలోపేతానికి కీలక నిర్ణయం

**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:**

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోలు మండలి సమావేశంలో సుమారు రూ. 3.60 లక్షల కోట్ల అంచనా వ్యయంతో వివిధ రక్షణ ప్రతిపాదనలకు 'అవసర ఆమోదం' లభించింది. ఈ నిర్ణయం దేశ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలకంగా భావిస్తున్నారు. భారత వాయుసేన కోసం బహుళ విధుల యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఇందులో రఫేల్ యుద్ధ విమానాలు, యుద్ధ క్షిపణులు, గగన నౌకల ఆధారిత అధిక ఎత్తులో దీర్ఘకాల నిఘా వ్యవస్థలు ఉన్నాయి. వీటి ద్వారా వాయుసేన దాడి, రక్షణ సామర్థ్యాలు మరింత పెరుగనున్నాయి. భారత భూసేన కోసం యాంటీ ట్యాంక్ మైన్స్ 'విభవ్', ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, టీ–72 ట్యాంకులు, బీఎంపీ–2 ఇన్ఫెంట్రీ కాంబాట్ వాహనాల పునరుద్ధరణకు ఆమోదం ఇచ్చారు. ఈ నిర్ణయంతో భూసేన యుద్ధ సన్నద్ధత మరింత బలోపేతం కానుంది. భారత నౌకాదళం కోసం 04 మెగావాట్ల సముద్ర గ్యాస్ టర్బైన్ ఆధారిత విద్యుత్ జనరేటర్లు, దీర్ఘశ్రేణి సముద్ర నిఘా పి–8ఐ విమానాల కొనుగోలు ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అదేవిధంగా భారత తీర రక్షక దళం కోసం డోర్నియర్ విమానాలకు ఎలక్ట్రో–ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ నిఘా వ్యవస్థల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. మొత్తంగా ఈ నిర్ణయాలు దేశ రక్షణ సామర్థ్యాలను ఆధునికీకరించి, భూభాగం, గగనం, సముద్రంలో సమగ్ర భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక మైలురాయిగా భావిస్తున్నారు.



# మేడారం మహాజాతర హుండీ లెక్కింపు పూర్తి

- 828 హుండీలతో రూ.13.25 కోట్ల ఆదాయం.
- విదేశీ కరెన్సీ, బంగారం, వెండి లభ్యం.

**జనం వాయిస్,హైదరాబాద్:**

తెలంగాణలో మేడారం 828 హుండీలతో రూ.13.25 కోట్ల ఆదాయం విదేశీ కరెన్సీ, బంగారం, వెండి లభ్యం. ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర హుండీ లెక్కింపు ప్రక్రియ ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుంచి హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన లెక్కింపులో మొత్తం 828 హుండీలను తెరిచి నగదు, ఆభరణాలను లెక్కించారు.వారం రోజుల పాటు సుమారు 400 మంది సిబ్బంది దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ.13,25,83,269 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. హుండీల్లో నగదుతో పాటు విదేశీ కరెన్సీ, రద్దు నోట్లు, బంగారం, వెండి ఆభరణాలు కూడా లభించాయి. గత మహాజాతరలో 540 హుండీల ద్వారా రూ.13.25 కోట్ల ఆదాయం నమోదవగా, ఈసారి 828 హుండీలు ఏర్పాటు చేసినప్పటికీ దాదాపు సమాన స్థాయిలోనే ఆదాయం రావడం విశేషం. హుండీల సంఖ్య గణనీయంగా పెరిగినా ఆదాయం పెరుగుదల పరిమితంగానే ఉండటం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే మేడారం జాతరలో లక్షలాది మంది పాల్గొనగా, హుండీ ఆదాయం కూడా భారీ స్థాయిలో నమోదవడం దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడనుంది. లభించిన నగదు, ఆభరణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో జమ చేయనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం.

## - అఖిలభారత కార్మిక సంఘాల సమైక్య.

**జనం వాయిస్ ప్రతినిధి, మేడ్చల్ ఫిబ్రవరి 12:**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా ఉప్పల్ సర్కిల్ ప్రాంతంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన దేశవ్యాప్త వ్యతిరేక విధానాలకు సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. అన్ని కార్మిక సంఘాలు ఆటో యూనియన్ నాయకులు ,కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ర్యాలీ నిర్వహించి రెండు గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్ విధానం రద్దు చేయాలని విద్యుత్ సాధారణ బిల్లులను అదేవిధంగా నూతన విత్తన చట్టాన్ని ఉపాధి పథకాన్ని కాపాడాలని లేబర్ కోట్ల విధానం రద్దు చేయాలని పలు డిమాండ్లతో మేడ్చల్ జిల్లాలోని చిల్కానగర్ ఉప్పల్ రామంతపూర్, హబ్సిగూడ, ప్రాంతాల్లో కార్మిక నాయకులు ఆటో యూనియన్ నాయకులతో వివిధ కార్యక్రమాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వెనక్కి తీసుకోవాలని, విదేశీ పెట్టుబడులను స్వాగతం పలికి రాష్ట్ర కార్మిక ప్రయోజనాలను నాశనం చేసే విధంగా చర్యలను ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే నిధులను కేంద్ర ప్రభుత్వం చిన్న చూపుతో చూడడం పద్ధతి కాదని



లేబర్ యాక్టివ్ కోడ్ ప్రకారం కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పెద్ద ఎత్తున కార్మికులతో సమ్మెను విజయవంతం చేశారు ఈ సమ్మెలో వ్యాపార వాణిజ్య వర్తక ఆటో విద్యా సంస్థలు బందులో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సి.ఐ.టి యు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె .వెంకన్న సి.ఐ.టి యు, నాయకులు వెంకటేష్ మేడిపల్లి భవన నిర్మాణ అధ్యక్షులు చల్ల నరసింహ, ఏ,ఐ,టి, యు,సి నాయకులు పరమేష్ జంగారెడ్డి బి .ఆర్ .టి. యు నాయకులు సంపత్ కుమార్ సైదులు ఐ ఎఫ్ టి యు నాయకులు సిపి. ఎం పార్టీ నాయకులు ఏం అశోక్ రెడ్డి నాగరాజు భీష్మాచారి ఊర్మిళ స్వామి వెంకటేశ్వర్లు తదితరులు కార్మిక సంఘాల నాయకులు ఐ. ఎ.న్ టి.యు. సి ,హెచ్. ఎం. ఎస్ నాయకులు కార్మిక వర్గ ప్రజలు పాల్గొన్నారు

# తొలి రౌండులోనే జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ఫలితం

**జనం వాయిస్, జమ్మికుంట:**




కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ తెలిపారు. ఇందుకోసం 5 హాల్లలో 30 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 30 మంది సూపర్‌వైజర్లు, 60 మంది అసిస్టెంట్లు విధుల్లో ఉంటారని, ప్రక్రియ మొత్తం ఒకే రౌండ్లో పూర్తికానుందని ఆయన వివరించారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బండ్ల గణేష్

- తిరుమలకు పాదయాత్రగా మొక్కు చెల్లింపు.
- పాదయాత్ర వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం.
- శ్రీవారి ప్రసాదం అందజేసిన నిర్మాత.

**జనం వాయిస్,అమరావతి, ఫిబ్రవరి 12:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సినీ నిర్మాత బండ్ల గణేష్ గురువారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కు చెల్లించిన అనంతరం అమరావతికి చేరుకుని ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023లో చంద్రబాబుపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిన సమయంలో, ఆయన విడుదలై మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే తిరుమలకు పాదయాత్రగా వెళ్తానని బండ్ల గణేష్ మొక్కుకున్న సంగతి తెలిసిందే. 2024 ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో తన సంకల్పాన్ని నెరవేర్చేందుకు బండ్ల గణేష్ 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన నివాసం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు సుమారు 535 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్ర ఫిబ్రవరి 10న తిరుమలకు చేరుకుంది. అక్కడ శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించారు. అనంతరం శ్రీవారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. బండ్ల గణేష్‌ను ముఖ్యమంత్రి ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు. పాదయాత్ర అనుభవాలను సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. దారి పొడవునా పార్టీ కార్యకర్తలు అండగా నిలిచి ప్రోత్సహించడంతో మరింత ఉత్సాహంగా యాత్ర పూర్తిచేశానని బండ్ల గణేష్ తెలిపారు.




# పోస్టల్ ఉద్యోగిని సత్కరించిన సి.జి.హెచ్.ఎస్ డాక్టర్లు

**జనం వాయిస్,గుంటూరు:**

పోస్టల్ డిపార్ట్మెంట్ లో మూడున్నర దశాబ్దాలు విశేష సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన పోస్టల్ అసిస్టెంట్ దేసు సుబ్బారావును సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ ( సిజిహెచ్ఎస్ ) డాక్టర్లు, ఉద్యోగులు సన్మానించారు. గురువారం నగరంపాలెం లోని సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో దేసు సుబ్బారావు దంపతులను సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.సి.హెచ్.కోటేశ్వరరావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ కొండా నాగార్జున తదితరులు పట్టు శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ..పోస్టల్ శాఖకు, సిజిహెచ్ఎస్ కు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. గుంటూరు సిజిహెచ్ఎస్ ఏర్పాటుకు దేసు సుబ్బారావు ఎన్నో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ కె.నాగార్జున మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ ఇచ్చిన ప్రోత్సాహం, సహకారంతోనే సిజిహెచ్ఎస్ వైద్యశాలలన్నీ పోస్టల్ శాఖ భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. దేసు సుబ్బారావు మాట్లాడుతూ..తనను సొంత స్టాఫ్ గా భావించి, ఘనంగా వీడ్కోలు చెబుతున్న సిజిహెచ్ఎస్ డాక్టర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఉద్యోగులు ఆయేషా బేగం, సునీల్, పేరేశ్వరరావు, మురళీ, రామారావు, మక్బూల్, వెంకటేశ్వర్లు, రత్నరాజు, నందమణి పాల్గొన్నారు.



# తిరుమల లడ్డూ కల్తీపై బాలినేని వ్యాఖ్యలు

- 'ఇంతటితో అంశాన్ని వదిలేయడం మంచిది"
- హిందువుల మనోభావాలు దెబ్బతినొద్దని సూచన
- తప్పు చేసిన వారిని దర్యాప్తు సంస్థలు చ చూసుకుంటాయని వ్యాఖ్య

**జనం వాయిస్,అమరావతి, ఫిబ్రవరి 12:**

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. ఈ అంశంపై అధికార పక్షం, వైసీపీ మధ్య మాటల యుద్ధం జరుగుతున్న వేళ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇప్పటికే స్పష్టంగా చెప్పారని బాలినేని పేర్కొన్నారు. ఈ విషయంపై పదేపదే చర్చించడం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు. ఇంతటితో ఈ అంశాన్ని ముగించడం మంచిదని సూచించారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే వారి విషయాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి, దర్యాప్తు సంస్థలు చూసుకుంటాయని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని ఉపయోగించకూడదని ఆయన పరోక్షంగా సూచించారు. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో జనసేన పార్టీ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనేది పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయిస్తారని బాలినేని తెలిపారు. పార్టీ నిర్ణయాలను అనుసరించడమే తమ విధి అని ఆయన స్పష్టం చేశారు.



# అంబటి రాంబాబు పీటీ వారెంట్‌పై గుంటూరు కోర్టుకు హాజరు



**జనం వాయిస్,గుంటూరు, ఫిబ్రవరి 12:**

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు అంబటి రాంబాబును పోలీసులు పీటీ వారెంట్‌పై రాజమండ్రి నుంచి గుంటూరు కోర్టుకు తరలించారు. సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా టిక్కెట్ల అవినీతి కేసులో విచారణ కోసం ఆయనను న్యాయస్థానంలో హాజరుపరిచారు. పోలీసు వాహనం గుంటూరు కోర్టు ప్రాంగణానికి చేరుకున్న అనంతరం, వాహనం దిగే ముందు అంబటి రాంబాబు 'తగ్గేదేలే' అంటూ స్పందించారు. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ చేసిన విధంగా వ్యాన్‌లో సీటుపై కూర్చుని గెడ్డం కింద చేయి పెట్టి స్టైల్‌గా స్పందించడం చర్చనీయాంశమైంది. ఆయనను కోర్టుకు తీసుకువచ్చిన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబు గత నెల 31వ తేదీ నుంచి రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఇప్పటికే రెండు కేసుల్లో న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, 2023లో లాటరీ ద్వారా అవినీతి జరిగిందని ఆరోపిస్తూ సత్తెనపల్లి జనసేన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి పోలీసులు గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేసి ఆయనను విచారణకు హాజరుపరిచారు. కేసు తదుపరి విచారణ కొనసాగుతోంది.

# మిరపకాయ బజ్జీలు

## రుచిలో కారం, సాయంత్రపు తిండికి రాజు

**జనం వాయిస్,డెస్క్, ఫిబ్రవరి 12:**
మిరపకాయ బజ్జీలు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన వీధి ఆహారాల్లో ఒకటిగా నిలిచాయి. సాయంత్రం వేళల్లో టీ దుకాణాల ముందు వేడివేడిగా వేస్తున్న బజ్జీల వాసనే ఆకలిని రేపుతుందని ఆహార ప్రియులు చెబుతున్నారు. పెద్ద మిరపకాయలను పిండి మిశ్రమంలో ముంచి నూనెలో వేయించడం ద్వారా తయారయ్యే ఈ వంటకం కారం, క్రంచ్ కలయికతో ప్రత్యేక రుచిని అందిస్తుందని పేర్కొంటున్నారు. రుచికి కారణం ఏమిటి మిరపకాయ బజ్జీలలో ఉపయోగించే మిరపకాయలు సాధారణంగా తక్కువ కారం ఉన్న ప్రత్యేక రకమైనవని వ్యాపారులు చెబుతున్నారు. పిండి మిశ్రమంలో శనగపిండి, ఉప్పు, కారం, సోడా కలిపి తయారు చేయడం వల్ల బజ్జీ బయటపక్క కరకరలాడుతూ, లోపల మృదువుగా ఉంటుందని పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల ఉల్లిపాయ, నిమ్మరసం, చట్నీ కలిపి వడ్డించడం ప్రత్యేకతగా మారిందని చెబుతున్నారు.

**- ఆరోగ్య పరంగా జాగ్రత్త అవసరం**

మిరపకాయ బజ్జీలు రుచికరమైనవే అయినప్పటికీ, అవి నూనెలో వేయించిన వంటకాలు కావడంతో తరచుగా ఎక్కువగా తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధిక నూనె వినియోగం, మళ్లీ మళ్లీ వేడి చేసిన నూనె వాడకం గుండె సంబంధిత సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఎసిడిటీ, గ్యాస్ సమస్యలున్నవారు పరిమితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. సాంస్కృతిక అనుభవంగా నిలిచిన వంటకం పండుగలు, జాతరలు, వర్షపు రోజుల్లో మిరపకాయ బజ్జీలు ఒక ప్రత్యేక అనుభవంగా మారాయని ప్రజలు చెబుతున్నారు. కుటుంబంతో, మిత్రులతో కలిసి వేడివేడిగా బజ్జీలు తినడం అనేక జ్ఞాపకాలను మిగుల్చుతుందని పేర్కొంటున్నారు. పరిమితంగా, శుభ్రమైన వాతావరణంలో తయారైన బజ్జీలు తీసుకుంటే రుచితో పాటు ఆనందాన్ని కూడా అందిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.






# వేప చెట్టు ఆరోగ్యానికి, పర్యావరణానికి సహజ రక్షకుడు

వేప చెట్టు భారతీయ సంస్కృతిలో పవిత్రమైనదిగా, ఔషధ గుణాలు కలిగినదిగా గుర్తింపు పొందింది. గ్రామాల్లో ఇళ్ల ముందు, దేవాలయాల దగ్గర వేప చెట్లు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవిలో చల్లని నీడనిచ్చే ఈ చెట్టు, పర్యావరణ సమతుల్యానికి కూడా తోడ్పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వేప చెట్టు ఒక సహజ వైద్య శాల లాంటిదని పెద్దలు పేర్కొం టున్నారు. ఆరోగ్యానికి వేప గుణాలు వేప ఆకులు, పువ్వులు, వేపనూనె ఇవి ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. చర్మ వ్యాధులు, గాయాలు, దురద వంటి సమస్యలకు వేప ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు. వేప ఆకులు నమలడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, శరీర శుద్ధికి సహాయపడుతుందని చెబుతున్నారు. వేప కషాయం సంప్రదాయ వైద్యంలో విస్తృతంగా ఉపయోగిస్తారని నిపు ణులు పేర్కొం టున్నారు. వ్యవసాయంలో వేప ప్రాధాన్యం

వేప గింజల నుంచి తీసే నూనె సేంద్రీయ వ్యవసాయంలో కీటకనాశకంగా ఉపయోగపడుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. రసాయన కీటకనాశకాల బదులు వేపనూనె వాడటం వల్ల పర్యావరణానికి హాని తక్కువగా ఉంటుందని సూచి స్తున్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా వేప ఉత్పత్తులు సహాయ పడతాయని పేర్కొం టున్నారు. పర్యావరణ రక్షణలో కీలక పాత్ర

వేప చెట్లు గాలిని శుద్ధి చేయడంలో, ఉష్ణోగ్రతను నియంత్రించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. గ్రామాల్లో వేప చెట్టు కింద ప్రజలు సమావేశాలు జరిపే సంప్రదాయం ఉండేదని పెద్దలు గుర్తుచేస్తున్నారు. వేపను కేవలం చెట్టుగా కాకుండా ఆరోగ్యం, పర్యావరణం, సంస్కృతికి ప్రతీకగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. వేప చెట్లను సంరక్షించడం, మరిన్ని నాటడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.







# శనగ గుడాలు ఒకప్పుడు పేదల ఆహారం

**గ్రామీణ జీవనంలో శనగ గుడాల వినియోగం**

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు శనగ గుడాలు మనుషులు తినే ఆహారంగానే విస్తృతంగా ఉపయోగంలో ఉండేవి. శనగలను వడకట్టిన తర్వాత మిగిలే గుడాలను శుభ్రంగా వడపోసి, కాల్చి లేదా ఉడికించి తినేవారని పెద్దలు గుర్తుచేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటంతో కూలీలు, రైతులు దీనిని పొట్ట నింపే ఆహారంగా వినియోగించేవారని చెబుతున్నారు. కాలక్రమంలో ఈ ఆహారం మెల్లగా కనుమరుగైనప్పటికీ, దాని పోషక విలువపై ఇప్పుడు మళ్లీ చర్చ మొదలైందని నిపుణులు చెబుతున్నారు. ఫైబర్ అధికం జీర్ణక్రియకు మేలు శనగ గుడాల్లో ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణక్రియకు ఇది మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మలబద్ధకం, కడుపు భారంగా ఉండే సమస్యలు తగ్గడంలో ఇది సహాయపడుతుందని సూచిస్తున్నారు. శరీరానికి ఎక్కువ కేలరీలు ఇవ్వకుండానే పొట్ట నిండిన భావన కలిగించడంలో శనగ గుడాలు ఉపకరిస్తాయని పేర్కొంటున్నారు. అందుకే ఒకప్పుడు కష్టమైన పనులు చేసే వారు దీనిని ఆహారంగా తీసుకునేవారని నిపుణుల అభిప్రాయం. సరైన విధానంలో తయారీ కీలకం తినేటప్పుడు శనగ గుడాలను తప్పనిసరిగా శుభ్రంగా వడపోసి, బాగా కాల్చి లేదా ఉడికించాల్సిన అవసరం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పచ్చిగా లేదా సరిగా శుద్ధి చేయకుండా తింటే జీర్ణ సమస్యలు రావచ్చని చెబుతున్నారు. కొన్నిచోట్ల గుడాలను ఉడికించి ఉప్పు, మిరపకాయలు కలిపి తినేవారని, మరికొన్ని ప్రాంతాల్లో పొడిచేసి ఇతర ఆహారాలతో కలిపేవారని పెద్దలు చెబుతున్నారు. మళ్లీ గుర్తింపు పొందాల్సిన


**సంప్రదాయ ఆహారం**

నేటి కాలంలో ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో శనగ గుడాల వంటి సంప్రదాయ ఆహారాలను మళ్లీ పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సరైన పరిశుభ్రత, పరిమిత మోతాదుతో వినియోగిస్తే ఇవి ఆరోగ్యానికి మేలు చేసే ఆహారంగా మారుతాయని చెబుతున్నారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన శనగ గుడాలు, నేటి ఆరోగ్య చర్చల్లో మళ్లీ స్థానం సంపాదించుకునే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు.



డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM

శుక్రవారం, ఫిబ్రవరి 13, 2026




## రాజా సాబ్ బ్యూటీ రిద్ధి కుమార్ అదరగొట్టిందిగా..!

తెలుగు సినీ ప్రేక్షకులకు "లవర్" సినిమాతో పరిచయమైన రిద్ధి కుమార్, తన తొలి చిత్రంతోనే అందంఅభినయాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. రాజ్ తరుణ్ సరసన కథానాయికగా నటించిన ఈ ముద్దుగుమ్మ, ఆ మూవీలో తన సహజమైన నటనతో ఆకట్టుకుంది. మొదటి సినిమాతోనే యువ ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఆ తర్వాత కొంతకాలం గ్యాప్ తీసుకున్న రిద్ధి, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన "రాధేశ్యామ్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. సినిమాలో అర్చరీ ప్లేయర్‌గా తళుక్కున మెరిసిన ఆమె పాత్ర చిన్నదైనా, తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. పెద్ద ప్రాజెక్ట్‌లో భాగమవడం ఆమె కెరీర్‌కు మంచి మైలురాయిగా నిలిచింది. ఇటీవల విడుదలైన "రాజా సాబ్" చిత్రంలో కూడా రిద్ధి కనిపించింది. ఈ సినిమాలో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ మెప్పించింది. అయితే సినిమాకు మిక్స్డ్ టాక్ రావడంతో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. సినిమా భారీ హిట్ అయ్యి ఉంటే రిద్ధి కుమార్‌కు తెలుగులో మరిన్ని పెద్ద అవకాశాలు దక్కేవని సినీ వర్గాలు భావిస్తున్నాయి.కేవలం తెలుగు మాత్రమే కాకుండా హిందీ, మరాఠీ, మలయాళ భాషల్లోనూ వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటిస్తూ తన ప్రతిభను చాటుకుంటోంది రిద్ధి. కంటెంట్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ, నెమ్మదిగా కానీ స్థిరంగా తన కెరీర్‌ను నిర్మించుకుంటోంది. ఇక సోషల్ మీడియాలో రిద్ధి చాలా యాక్టివ్. తరచూ ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. ట్రెండీ అవుట్‌ఫిట్స్, స్టైలిష్ లుక్స్‌తో మెరిసిపోతూ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇస్తోంది.సినిమా ఫలితాలు ఎలా ఉన్నా, తన టాలెంట్‌పై నమ్మకం ఉంచుకుని ముందుకు సాగుతున్న రిద్ధి కుమార్ భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## విజయ్ రష్మిక పెళ్లి వీడియో డీల్?

### - ఓటీటీలకు 'నో' చెప్పిన రౌడీ హీరో!

టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీ జంటగా అభిమానుల్లో గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ నేపథ్యంలో వీరి వివాహానికి సంబంధించిన వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. గతంలో కొన్ని స్టార్ జంటల వివాహ వీడియోల విషయంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు, విడుదల ఆలస్యాలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ముఖ్యమైన వేడుకను వ్యాపారంగా మార్చడం ఇష్టం లేకపోవడంతోనే ఈ ఆఫర్‌ను అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ వివాహాన్ని అత్యంత ప్రైవేట్‌గా, కుటుంబ సభ్యులు మరియు ఆత్మీయుల మధ్య జరుపుకోవాలనే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. తాజా ప్రచారం ప్రకారం, ఫిబ్రవరి 26, 2026న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగవచ్చని సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఏర్పాట్లకు సంబంధించిన కొన్ని వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయాలపై విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఏదేమైనా, ఈ వార్తలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, అధికారిక ప్రకటన కోసం సినీ వర్గాలు, అభిమానులు ఎదురుచూస్తున్నారు.



## నాని వెంకీ అట్లూరి కాంబోలో క్రేజీ మూవీ.

### సితార బ్యానర్‌లో మరో ప్రాజెక్ట్

స్టార్ హీరో నాని వరుస విజయాలతో ఫుల్ జోష్‌లో ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్న నాని, ఆ తర్వాత దర్శకుడు సుజీత్‌తో మరో ప్రాజెక్ట్ చేయనున్నాడు. ఇదిలా ఉండగా, మరో క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేయబోతున్నట్లు సమాచారం. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందిన వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందనుందని తెలుస్తోంది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార



ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ గెలిచిన సినిమా తర్వాత నాని సితార కాంబినేషన్‌లో మరో సినిమా రావడం అభిమానుల్లో అంచనాలను పెంచుతోంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. అనంతరం సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా రూపొందుతున్న 'విశ్వనాథన్ అండ్ సన్స్' (సూర్య 46) చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇరు ప్రాజెక్టులు పూర్తయ్యాక, 2026 ద్వితీయార్థంలో నాని వెంకీ అట్లూరి సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి ఆసక్తి నెలకొంది.

## 70వ సౌత్ ఫిలింఫేర్ అవార్డ్స్ నామినేషన్లు తెలుగు

# సినిమాల జోరు

చిత్ర పరిశ్రమలో నటీనటుల ప్రతిభను గుర్తిస్తూ ప్రతిష్టాత్మకంగా అందించే ఫిలింఫేర్ అవార్డ్స్‌కు సినీ ప్రియుల్లో ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ అవార్డుల కోసం ప్రేక్షకులు, సినీ తారలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన 70వ సౌత్ ఫిలింఫేర్ అవార్డ్స్ నామినేషన్ల జాబితాను నిర్వాహకులు తాజాగా విడుదల చేశారు. ఈ జాబితాలో తెలుగు సినిమాలు గణనీయమైన స్థానం సంపాదించడం టాలీవుడ్‌కు మరోసారి గౌరవాన్ని తీసుకువచ్చింది.

దక్షిణాది చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మక వేడుకలలో ఒకటిగా భావించే ఫిలింఫేర్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఈ నెల ఫిబ్రవరి 21న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల చిత్రాలు వివిధ విభాగాల్లో పోటీపడుతున్నాయి. ముఖ్యంగా 2024లో విడుదలైన చిత్రాలను పరిశీలించి ఈ ఏడాది నామినేషన్లను ప్రకటించారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ దర్శకుడు, సంగీతం, ఛాయాగ్రహణం వంటి పలు విభాగాల్లో నామినేషన్లు ఉండగా, తెలుగు సినిమాలకు విశేష ప్రాధాన్యం దక్కడం ప్రత్యేకంగా నిలిచింది.

ఉత్తమ చిత్రం నామినేషన్లు:

35 చిన్న కథ కాదు, కమిటీ కుర్రోళ్లు, హనుమాన్, కల్కి 2898 ఏడీ, లక్కీ భాస్కర్, పుష్ప : ది రూల్.

ఉత్తమ దర్శకుడు నామినేషన్లు:

నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ), నంద కిశోర్ (35 చిన్న కథ కాదు),




ప్రశాంత్ వర్మ (హనుమాన్), సుకుమార్ (పుష్ప : ది రూల్), వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు).

ఉత్తమ నటుడు నామినేషన్లు:

అల్లు అర్జున్ (పుష్ప : ది రూల్), దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), ఎన్టీఆర్ (దేవర), నాని (సరిపోదా శనివారం), సిద్ధూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్), తేజ సజ్జ (హనుమాన్).

ఉత్తమ నటి నామినేషన్లు:

అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్), ఆషికా రంగనాథ్ (నా సామిరంగ), మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్), నివేదా థామస్ (35 చిన్న కథ కాదు), ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం), రష్మిక (పుష్ప : ది రూల్).

ఉత్తమ సహాయ నటుడు నామినేషన్లు:

అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ), ధనంజయ్ (జీబ్రా), ఫహద్ ఫాజిల్ (పుష్ప : ది రూల్), సత్య (మత్తు వదలరా 2), ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం), వినయ్ రాయ్ (హనుమాన్).

ఉత్తమ సహాయ నటి నామినేషన్లు:

అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి), ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2), రషి సింగ్ నందు (ప్రసన్నవదనం), శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజీ బ్యాండు), శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ), వరలక్ష్మి శరత్‌కుమార్ (హనుమాన్).

ఈసారి నామినేషన్లలో తెలుగు చిత్రాల ఆధిపత్యం కనిపించడం టాలీవుడ్ ప్రస్థానానికి మరో మైలురాయిగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. అవార్డుల ఫలితాలపై ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com